
నమస్తే తెలంగాణ
నల్లగొండ
10 | నల్లగొండ, మంగళవారం 18 ఫిబ్రవరి 2025 | NALGONDA

## వెలుగు సిబ్బంది నిర్బంధం

మునుగోడు, ఫిబ్రవరి 17 : మహిళా సంఘాల పొదుపు డబ్బులను సొంతానికి వాడుకున్న వీబీకేతో పాటు వెలుగు సిబ్బందిని కచలాపురం గ్రామస్తులు గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్బంధించారు. బాధితులు, అధికారులు వివరాల ప్రకారం.. మునుగోడు మండలంలోని కచలాపురం గ్రామంలో 18 మహిళా సంఘాలు ఉండగా, శ్రీనిధి కింద అధికారులు రూ.55లక్షలను అప్పుగా ఇచ్చారు. ఆ అప్పులు బ్యాంకులో తిరిగి చెల్లించేందుకు ప్రతి నెలా గ్రామ వీబీకే పెద్దమామిడి సుఖేందర్‌కు ఆయా సంఘాలు మహిళలు అప్పజెప్తున్నారు. సుఖేందర్ మాత్రం వసూలు చేసిన డబ్బును బ్యాంకులో జమ చేయకుండా కొన్ని నెలలుగా సొంతానికి వాడుకుంటున్నాడు. బ్యాంకులో డబ్బులు కట్టిన రశీదులు ఇవ్వాలని మహిళ సంఘం సభ్యులు అడిగితే రేపు, మాపు అంటూ మాట దాటవేస్తున్నాడు. అనుమానంతో వచ్చిన మహిళ సంఘాలు సోమవారం గ్రామానికి వచ్చిన వెలుగు అధికారులతో పంచాయతీ కార్యాలయం ఆవరణలో సంఘాల రికార్డులను తనిఖీ చేయించారు. ఆయా సంఘాలు తీసుకున్న మొత్తం రూ.55లక్షలకు గాను ఇప్పటివరకు తిరిగి చెల్లించింది రూ.44.59లక్షలు కాగా, వీబీకే సుఖేందర్ 33.59 మాత్రమే బ్యాంకులో జమ చేసినట్లు తేలింది. మిగతా 11లక్షల సొంతానికి వాడుకున్నట్లు తేలడంతో మహిళ సంఘాలు సభ్యురాళ్లు వీబీకేతోపాటు వెలుగు అధికారులను గ్రామ పంచాయతీ ఆవరణలో ఉంచి తాళం వేశారు. తాము చెల్లించిన డబ్బులు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోలీసులు వచ్చి మహిళా సంఘాలకు నచ్చచెప్పి తాళం తీసి అధికారులను బయటకు పంపించారు. వీబీకే సుఖేందర్‌ను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.



బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా దామరచర్లలోని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ వద్ద కేక్ కట్ చేస్తున్న మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, చిత్రంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్, మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్‌రావు, తిప్పన విజయసింహారెడ్డి, బీఆర్‌ఎస్ నేతలు

# కేసీఆర్‌కు జేజేలు

## ఘనంగా జన నేత జన్మదిన వేడుకలు

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సేవా కార్యక్రమాలు
- కేక్ కటింగ్‌లు.. మొక్కలు నాటిన నేతలు
- రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ
- గుట్టలో కేసీఆర్ పేరు మీద మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి పూజలు
- బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో కంచర్ల హోమం
- యాదాద్రి పవర్ ప్లాంట్ వద్ద సంబురాలు
- వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు
- రక్తదానం చేసిన మాజీ ఎమ్మెల్యే నోముల భగత్


హాలియాలో రక్తదానం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్


సూర్యాపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల ఎదుట కేక్ కట్ చేస్తున్న మాజీ ఎంపీ బడుగుల, బీఆర్‌ఎస్ శ్రేణులు


నల్లగొండ ప్రభుత్వ మెడికల్ కళాశాల ఎదుట కేక్ కట్ చేస్తున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల, రవీంద్రకుమార్, భిక్షమయ్యగౌడ్, మాజీ జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నేత చింతల వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు

యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 17 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ జన్మదిన వేడుకలు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. సోమవారం పట్టణాలు, పల్లెల్లో వాడవాడలా పుట్టిన రోజు సంబరాలను జరుపుకొన్నారు. ఉదయం నుంచే బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక పూజలు చేశారు. పెద్దఎత్తున సేవా కార్యక్రమాలు చేపట్టారు. అన్నదానం చేశారు. ఆస్పత్రులు, అనాథ ఆశ్రమాల్లో పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. మొక్కలు నాటారు. మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని కేసీఆర్ పేరు మీద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం యాదగిరిగుట్ట వైకుంఠ ద్వారం వద్ద బీఆర్‌ఎస్ శ్రేణులు ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను కట్ చేశారు. రాయగిరిలోని కలెక్టరేట్ ఎదుట కూడా కట్ చేశారు. భువనగిరిలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో కేసీఆర్ జన్మదినం సందర్భంగా కంచర్ల రామకృష్ణా రెడ్డి దంపతులు ఆయుష్ హోమం నిర్వహించారు. భువనగిరి పట్టణ కేంద్రంలోని ఏరియా ఆస్పత్రిలో మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి పండ్లు పంపిణీ చేశారు. మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్‌ఎస్ నాయకులు కేక్ కట్ చేశారు. అక్కడి నుంచి రామలింగేశ్వర ఆలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. ఆలేరులోని హరిహరపుత్ర అయ్యప్ప స్వామి ప్రాంగణంలో మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి మొక్కలు నాటారు. ఆలేరులోని కేసీఆర్ డబుల్ బెడ్రూమ్ కాలనీ ప్రాంగణంలో మాజీ డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి మొక్కలు నాటారు. పోచంపల్లిలో కేక్ కట్ చేసి, ప్రభుత్వ ఆస్పత్రిలో పండ్లు పంచారు. మోటకొండూరులో కేక్ కట్ చేసి, స్వీట్లు పంచారు. ఎస్సీ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు, మోటకొండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పేషెంట్లకు పండ్లు పంపిణీ చేశారు. చౌటుప్పల్‌లో మిషన్ భగీరథ పైలాన్ వద్ద కేసీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. యాదగిరిగుట్ట మండలంలోని చిన్నకందుకూరు గ్రామంలో బీఆర్‌ఎస్ పార్టీ విద్యార్థి విభాగం నాయకుడు వినయ్ పొలాల మధ్య డ్రోన్‌తో కేసీఆర్ ఫ్లెక్సీని ఎగురవేసి అభిమానం చాటుకున్నాడు. ఆత్మకూర్ (ఎం), అడ్డగూడూరు, ఆలేరు, బొమ్మలరామారం, తుర్కపల్లి, వలిగొండ, రామన్నపేట, సంస్థాన్‌నారాయణపురం మండలాల్లోనూ బీఆర్‌ఎస్ నాయకులు స్థానికులతో కలిసి కేక్ కట్ చేసి సంబురాలు చేశారు. నల్లగొండ జిల్లాలోని దామరచర్ల మండలంలో యాదాద్రి పవర్‌ప్లాంటు వద్ద మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి మాజీ ఎమ్మెల్యేలు రమావత్ రవీంద్రకుమార్, నల్లమోతు భాస్కర్‌రావు, తిప్పన విజయసింహారెడ్డితో కలిసి కేక్ కట్ చేశారు. నల్లగొండ జిల్లా కేంద్రం శివారులోని మెడికల్ కళాశాల ఎదుట మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి.. మాజీ ఎమ్మెల్యేలు రమావత్ రవీంద్రకుమార్, మాజీ కంచర్ల భూపాల్‌రెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డితో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో రక్తదాన శిబిరం, వృక్షార్చన కార్యక్రమాన్ని ప్రారంభించారు. బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో జిల్లా జనరల్ ఆసుపత్రిలో రోగులకు, వారి సహాయకులకు అన్నదానం చేశారు. దేవరకొండ పట్టణంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ ఆధ్వర్యంలో కేసీఆర్ సర్కారులో నిర్మించిన డబుల్ బెడ్రూమ్ ఇండ్ల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం కేక్ కట్ చేయడంతో పాటు పండ్లు పంపిణీ చేశారు. మిర్యాలగూడ పట్టణంలో మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డితో కలిసి కేక్ కట్ చేశారు. నకిరేకల్ పట్టణంలోని మెయిన్ సెంటర్‌లో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య భారీ కేక్ కట్ చేశారు. అంతకు ముందు ర్యాలీగా వెళ్లి వంద పడకల ఆసుపత్రి ప్రాంగణంలో మొక్కలు నాటారు. నకిరేకల్ సెంటర్‌లో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. నార్కెట్‌పల్లిలో జరిగిన వేడుకల్లోనూ చిరుమర్తి పాల్గొన్నారు. హాలియాలో మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ ఆధ్వర్యంలో కేసీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన భారీ కేక్ కట్ చేసి కార్యకర్తలకు తినిపించారు. అనంతరం మొక్కలు నాటారు. రక్తదానం శిబిరాన్ని ప్రారంభించారు. భగత్ కూడా రక్తదానం చేశారు. గుర్రంపోడు మండల కేంద్రంలో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు పాశం గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన భారీ కేక్‌ను కట్ చేశారు. నందికొండలో ఎంసీ కోటిరెడ్డి బీఆర్‌ఎస్ శ్రేణులతో కలిసి మొక్కలు నాటారు. సూర్యాపేట జిల్లావ్యాప్తంగానూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్, మెడికల్ కాలేజీ, ఎస్పీ ఆఫీస్, ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఆవరణలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు.


నాగార్జునసాగర్‌లో కేసీఆర్ పుట్టిన రోజు వేడుకల్లో ఎమ్మెల్సీ కోటిరెడ్డి


నకిరేకల్‌లో అన్నదానం ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య


దేవరకొండలో మొక్క నాటుతున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్



తుంగతుర్తిలో కేక్ కట్ చేస్తున్న మాజీ జడ్పీ చైర్మన్ గుజ్జ దీపికాయుగంధర్‌రావు దంపతులు, బీఆర్‌ఎస్ శ్రేణులు


చౌటుప్పల్ ప్రభుత్వ దవాఖానాలో పండ్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

## తెలంగాణ ప్రతి ఇంచుపై కేసీఆర్ ఆనవాళ్లు

- చెరిపేయడం ఎవరి తరమూ కాదు
- అది గుర్తుచేసేందుకు పవర్‌ప్లాంట్, గుట్టలో వేడుకలు
- కేసీఆర్ పాలనలో అభివృద్ధికి కేరాఫ్ తెలంగాణ
- నేడు రాష్ట్రం వెనక్కి పోతున్న పరిస్థితి
- తెలంగాణ రాష్ట్ర పరిరక్షణకు మరో పోరాటానికి సిద్ధమవుదాం
- మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్ వద్ద మాజీ కేసీఆర్ జన్మదిన వేడుకలు

దామరచర్ల, ఫిబ్రవరి 17 : తెలంగాణ నేల మీది ప్రతి ఇంచుపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆనవాళ్లు ఉంటాయని, వాటిని చెరిపేయడం ఎవరి తరమూ కాదని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను సోమవారం మండలంలోని యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్ వద్ద ఘనంగా నిర్వహించారు. రూ.30వేల కోట్లతో యాదాద్రి పవర్‌ప్లాంట్ ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతగా ప్లాంట్ ముందు మాజీ ఎమ్మెల్యేలు రమావత్ రవీంద్రకుమార్, నల్లమోతు భాస్కర్‌రావు, తిప్పన విజయసింహారెడ్డితో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేస్తామంటూ కాంగ్రెస్ నాయకులు చెప్పడం సిగ్గుచేటన్నారు. తెలంగాణలోని ప్రతి జిల్లాలో, ప్రతి మండలంలో, ప్రతి గ్రామంలోనూ కేసీఆర్ ఆనవాళ్లు ఉన్నాయని, ఆ విషయాన్ని గుర్తుచేసేందుకు కేసీఆర్ పునర్నిర్మించిన యాదగిరిగుట్ట ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, యాదాద్రి పవర్ ప్లాంట్ వద్ద ఆయన జన్మదిన వేడుకలను నిర్వహించినట్లు చెప్పారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా ప్రభుత్వ రంగ సంస్థగా 4 వేల మెగావాట్ల సామర్థ్యంతో అల్ట్రా పవర్ థర్మల్ పవర్ ప్లాంట్‌ను కేసీఆర్ ఆలోచనతో దామరచర్ల మండలంలో నిర్మించినట్లు తెలిపారు. యాదాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణంతో ఉమ్మడి నల్లగొండ జిల్లా ముఖ స్వరూపాన్నే మార్చి అద్భుతమైన ఆర్థికాభివృద్ధి కేంద్రంగా నిలిపారన్నారు. పవర్ ప్లాంట్ ఉద్దేశం, ఆలోచన తెలియని వారు, అభివృద్ధికి మూలం విద్యుత్ అనే సోయిలేని వారు కొద్దిమంది అప్పట్లో పిచ్చివాగుడు వాగారని, ఇప్పుడు వారికి అర్థమవుతుందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం వస్తేనే సమస్యలు తీరుతాయని గుర్తించిన ఉద్యమ నేత కేసీఆర్ 14 ఏండ్లు ప్రాణాలకు తెగించి కొట్లాడి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారని గుర్తుచేశారు. అనంతరం ప్రజల కోరిక మేరకు ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకొని ఆరేండ్లలోనే ప్రపంచలోనే ఎక్కడా జరుగని విధంగా తెలంగాణను అభివృద్ధికి చిరునామా మార్చారని కొనియాడారు. అద్భుత పరిపాలనా దక్షకుడు కేసీఆర్ అని పేర్కొన్నారు. 2014లో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి ఉండగా, 2020 నాటికి 40 లక్షలు మెట్రిక్ టన్నులకు పెంచి నల్లగొండ జిల్లాను మొదటి స్థానంలో నిలిపిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. దేశానికే అన్నం పెట్టే స్థాయికి తెలంగాణను తీసుకొచ్చారని తెలిపారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పాలకులు రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తున్నారని, వారి మూర్ఖత్వం వల్ల తెలంగాణ మళ్లీ వెనక్కి పోయే పరిస్థితులు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఏడాది రాష్ట్ర ఆదాయం 15 వేల కోట్ల నష్టానికి చేరిందన్నారు. గతంలో కేసీఆర్ నిరంతర విద్యుత్ ఇస్తే ఇప్పటి పాలకులు రోజుకు 10 గంటల పాటు విద్యుత్ కోత విధిస్తున్నారని, వ్యవసాయ రంగాన్ని నాశనం చేశారని పేర్కొన్నారు. చివరికి కులగణన చేసి ఉన్న జనాభాను తక్కువగా చూపి కేంద్రం నుంచి వచ్చే నిధులు రాకుండా చేశారని మండిపడ్డారు. భవిష్యత్‌లో జనాభా ప్రాతిపదికన పార్లమెంటులో నియోజక వర్గాల పునర్వ్యవస్థీకరణ జరిగితే ఉన్న సీట్లు తగ్గిపోయే స్థితికి తీసుకొచ్చారని దుయ్యబట్టారు. రాష్ట్రాన్ని కాపాడేందుకు మళ్లీ మరొక ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణకు కేసీఆరే శ్రీరామరక్ష అని ప్రజలందరూ ముక్తకంఠంతో చెప్తున్నారని పేర్కొన్నారు. యాదాద్రి పవర్ ప్లాంట్ నిర్వాసితులు పలు సమస్యలను మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి దృష్టికి తీసుకురాగా, ఆయన స్పందించారు. పవర్ ప్లాంట్ కోసం ఎవరైతే ఇండ్లు, భూములు కోల్పోయారో వారికి ఉద్యోగాలు ఇస్తామని నాడు హామీ ఇచ్చామని, నేడు వారందరికీ మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. పాలకులు, జిల్లా మంత్రులు పట్టించుకోకపోతే తాము ముందుండి పోరాడుతామని భరోసానిచ్చారు. అసెంబ్లీ దృష్టికి తీసుకువెళ్తామని, అవసరమైతే ప్లాంటు వద్ద కొట్లాడుతామని ధైర్యమిచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు డి.నారాయణ రెడ్డి, చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, చిట్టిబాబునాయక్, వీరకోటిరెడ్డి, హాతీరాంనాయక్, బైరం సంపత్, మేగ్యానాయక్, కటికం సైదులురెడ్డి, బాలాజీనాయక్, కుర్ర శ్రీనునాయక్, సైదులు, రంగారెడ్డి, సత్యనారాయణ, యూసుఫ్, కోట్యానాయక్, సోము సైదిరెడ్డి, బాల సత్యనారాయణ, రఫీ, సచిన్‌నాయక్, సైదయ్య పాల్గొన్నారు.


పెద్దగట్టు లింగమంతుల స్వామి దర్శనానికి బారులుదీరిన జనం

## పెద్దగట్టుకు పోటెత్తిన భక్తజనం

సూర్యాపేటటౌన్/చివ్వెంల, ఫిబ్రవరి 17 : రాష్ట్రంలో రెండో అతి పెద్ద జాతర అయిన దురాజ్‌పల్లి పెద్దగట్టు జాతరకు రెండోరోజు సోమవారం భక్తులు పోటెత్తారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి లక్షలాదిగా భక్తులు గుట్టపైకి చేరుకున్నారు. తమ ఇష్ట దైవానికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సోమవారం తెల్లవారు జామున మద్దెరపోలు, ముత్యాలపోలు, లగ్గంపోలు కార్యక్రమం నిర్వహించారు. బైకాని వారు వాయిద్యాలు వాయిస్తూ గొల్లల చరిత్రను కథల రూపంలో తెలియజేస్తూ ఆలయహక్కు దారులైన మున్న, మెంతబొయిన వారి సమక్షంలో మద్దెర పోలు నిర్వహించారు. బైకాని ప్రధాన పూజారి లింగమంతుల స్వామి చౌడమ్మ గర్భగుడి ఎదుట ఉంచిన దేవర పెట్టె ముందు పసుపుతో ముగ్గులు వేశారు. ముగ్గులపై పోలుముంతలు ఉంచి, రెండు మట్టి కంచుడులో నెయ్యి, నువ్వుల నూనె పోసి దీపారాధాన చేశారు. బైరవ ఆకారంలో వేసిన ముగ్గులపై కుడకలు, తమలపాకులు, నిమ్మకాయలు, జీడిగింజలు పెట్టి బైకాని వారు మైసాక్షితో హారతినిచ్చారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే బీఎల్‌ఆర్‌తో పాటు కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ స్వామివారిని దర్శించుకున్నారు. జంతుబలితో పెద్దగట్టు ఎరుపెక్కింది. భక్తులు ఎడ్లబండ్లను పక్కకుపెట్టి.. ట్రాక్టర్లు, జీపులు, ఇతర వాహనాలపై జాతరకు వచ్చారు. జాతరలో సెల్‌ఫోన్ సిగ్నల్ లేకపోవడంతో భక్తులు కొంత ఇబ్బంది పడ్డారు. లింగమంతుల స్వామికి బోనం సమర్పించిన మహిళలు గుడి చుట్టూ పొర్లు దండాలు పెట్టారు.



జాన్‌పహాడ్ గ్రామంలో ప్రభుత్వం నిర్మించిన మరుగుదొడ్లకు అదానీ ఫౌండేషన్ పేరు

## ప్రభుత్వ నిర్మాణానికి ప్రైవేట్ రంగు

- మరుగుదొడ్లకు అదానీ ఫౌండేషన్ పేరు
- సోషల్‌మీడియాలో వైరల్ అవడంతో తీయించిన అధికారులు

పాలకవీడు, ఫిబ్రవరి 17 : మండలంలోని జాన్‌పహాడ్ గ్రామంలో ప్రభుత్వ నిధులతో నిర్మించిన మరుగుదొడ్లకు ప్రైవేట్ సంస్థ పేరు రాయడంతో స్థానికులు తిరస్కరించారు. దీన్ని సోషల్ మీడియాలో వైరల్ చేయడంతో అప్పటికప్పుడు రంగు మార్చి తప్పును సరిదిద్దుకున్నారు. జాన్‌పహాడ్ దర్గా వద్ద ప్రభుత్వం ఇటీవల రూ.కోటితో మౌలిక వసతుల కల్పనకు మరుగుదొడ్లు, సీసీ రోడ్లు వేయించింది. ఉర్సు ఉత్సవాలకు హాజరైన ఆదానీ సంస్థ అధికారులు దర్గా వద్ద మౌలిక వసతుల కల్పనకు కొంత ఆర్థికసాయం చేశారు. దీన్ని అవకాశంగా తీసుకున్న కొందరు స్థానిక నాయకులు అధికారులతో కుమ్మక్కై ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్మించిన మరుగుదొడ్లకు అదానీ సంస్థ కట్టించినట్లు పేరు పెట్టారు. దీంతో గ్రామస్తులు గమనించి సోషల్ మీడియాలో వైరల్ చేయడంతో స్థానిక నాయకుడు కల్పించుకొని మరుగుదొడ్లపై ఉన్న అదానీ సంస్థ పేరును తీయించాడు. జిల్లా అధికారులు దీనిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. దర్గా ఇన్‌స్పెక్టర్ మహమూద్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్మించిన మరుగుదొడ్లకు ప్రైవేట్ సంస్థ పేరు రాయించడం నిజమేనని, దాన్ని అడ్డుకొని సంస్థ పేరు తొలగించినట్లు ఆయన తెలిపారు.


సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అదానీ ఫౌండేషన్ పేరును తొలగిస్తున్న సిబ్బంది